teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 351 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 14 మే 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## టిబిని నిర్మూలనకు వ్యూహాలు అవసరమని ప్రధాని పిలుపు



న్యూ ఢిల్లీ, మే 13 (తీన్మార్ న్యూస్): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టిఇపి) పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. 2024 లో టిబి రోగులను ముందస్తుగా గుర్తించడం మరియు చికిత్స చేయడంలో గణనీయమైన పురోగతి సాధించిందని ప్రధానమంత్రి

మిగతా 2 లో




## రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఎంపికకు సిబిల్ స్కోర్..?

ఆందోళనలో దరఖాస్తుదారులు

సిబిల్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు సంబంధం లేదు


స్కీముపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ



# మండుతున్న ఎండల్లో.. చల్లని కబురు

రానున్న నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

అండమాన్‌ను తాకిన రుతు పవనాలు.. వాతావరణ శాఖ వెల్లడి



గత కొద్ది రోజులుగా ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం పది దాటిందంటే చాలు ఇండ్లనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది.



## ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం కీలక ప్రకటన

61.45 శాతం యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తి

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా సాగుతోందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 61.45 శాతం యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. మే 12వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. నిరుడు 2023-24 సంవత్సరం ఇదే సమయానికి 29.88 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. 2022-23లో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే యాసంగి సీజన్‌లో

మిగతా 2 లో

## సైనిక్ స్కూల్స్‌లో లోకల్ కోటాపై స్పందించిన మంత్రి పొన్నం

సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేసే వరకు ఏపీలో స్థానికత కల్పించాలి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): ఈ విద్యా సంవత్సరం ఏపీ సైనిక్ స్కూల్స్‌లో తెలంగాణ విద్యార్థులకు లోకల్ కోటా కంటిన్యూ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న విషయం

మిగతా 2 లో



## పాకిస్తాన్ హైకమిషన్ ఉద్యోగి రెహమాన్‌పై భారత్ వేటు

రాయబార ఉద్యోగి ముసుగులో కొనసాగుతున్న రెహమాన్

కార్యాలయంలో అర్హతలేని వ్యక్తిగా అధికారిక ప్రకటన

02

## ఏసీబీ కేసులో కొత్త ట్విస్టు

వెలుగులోకి డీఎస్పీ పార్థసారథి కేసు

61 బుల్లెట్ క్యాట్రిడ్జిలు, 29 లైవ్ బుల్లెట్ రౌండ్‌లు గుర్తింపు

హాయత్ నగర్ పీఎస్‌లో ఏసీబీ అధికారులు ఫిర్యాదు




హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి ఏసీబీ కేసులో కొత్త ట్విస్టు వెలుగులోకి వచ్చింది. హాయత్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలోని పార్థసారథి ఇంట్లో

మిగతా 2 లో







## లాడ్ బజార్‌లోని దుకాణాల్లో సుందరీమణుల షాపింగ్

తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫొటో షూట్

అందాల భామలకు చౌమొహల్లా ప్యాలెస్లో విందు ఏర్పాటు

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ -2025 కాంపిటీషన్ స్టార్ట్ కాగా మంగళవారం అందాల భామలకు హైదరాబాద్ ఐకానిక్ ప్లేస్ చౌమొహల్లా ప్యాలెస్‌లో విందును ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ప్రపంచ


మిగతా 2 లో



## ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా

సీఎస్ కె.రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ

.. వివరాలు 2లో



## మే 15న ప్రారంభంకానున్న సరస్వతీ పుష్కరాలు

ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి

.. వివరాలు 2లో



## వసతి గృహాల్లో మెరుగైన సేవలకు ప్రణాళికలు చేయాలి

అధికారులకు సీఎస్ కె.రామకృష్ణరావు ఆదేశాలు

తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని వివిధ సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ వసతి గృహాల్లో మెరుగైన సేవలు అందించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని

మిగతా 2 లో

## వేసవి దృష్ట్యా వన్యప్రాణి సంరక్షణపై చర్యలు తీసుకోవాలి



అటవీ శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ సమావేశం

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించి అటవీ సంపద కాస్తా బూడిదవుతాయి. ఏటా ప్రమాదాలతో వేలాది వృక్షాలు మంటలకు ఆహుతి

మిగతా 2 లో




## సీఎం రేవంత్ రెడ్డితో భేటీ ఐన సమాచార కమిషనర్లు

ఈ నేపథ్యంలో సీఎంకు శాలువాతో సన్మానం

# మండుతున్న ఎండల్లో.. చల్లని కబురు



తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): గత కొద్ది రోజులుగా ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం పది దాటిందంటే చాలు ఇండ్లనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రానున్న నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. సముద్రంలో అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం, బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలలతో వర్షాలు కురిస్తాయని అంచనా వేసింది. మరికొన్ని జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రాగల మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులు గాలి వేగం గంటకు 40-50 కి.మీతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఉరుములు, మెరుపులు,ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## ఏసీబీ కేసులో కొత్త ట్విస్టు

మొదటి పేజీ తరువాయి




రెండో రోజు సోదాలు జరిపిన ఏసీబీ అధికారులకు అతని ఇంట్లో ఊహించని విధంగా 61 బుల్లెట్ క్యాట్రిడ్జిలు, 29 లైవ్ బుల్లెట్ రౌండ్‌లు దొరికాయి. దీంతో ఏసీబీ అధికారులు ఈ బుల్లెట్‌ల వ్యవహారంపై హాయత్ నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో హాయత్ నగర్ పోలీసులు డీఎస్పీ పార్థసారథిపై కేసు నమోదు చేసి బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. పార్థసారథి ఈ బుల్లెట్‌లను 1992 నుంచి 1997 వరకు స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా ఏటూరు నాగారంలో పనిచేసిన సమయంలో కొన్ని బుల్లెట్‌లను దాచిపెట్టుకున్నాడని, ఆ తర్వాత ఎస్ఐగా ఎంపికై పదోన్నత్తులు పొంది తాజాగా డీఎస్పీగా పని చేస్తున్నంత వరకు బుల్లెట్‌లను తన వద్ద ఉంచుకున్నాడని తెలిసింది. అయితే పోలీసు అధికారిగా బుల్లెట్‌లను తీసుకున్నప్పుడు వాటికి సంబంధించిన రికార్డును కచ్చితంగా బెల్ ఆఫ్ ఆర్మ్‌లో నమోదు చేయాలి. తిరిగి అప్పజెప్పే సమయంలో కూడా వాటి వివరాలను నమోదు చేయాలి. కానీ అలా చేయకుండా పార్థసారథి అక్రమంగా ఈ బుల్లెట్‌లను ఎందుకు పెట్టుకున్నాడనే విషయం ఏసీబీ అధికారులకు అంతుచిక్కడం లేదు. అయితే ఇన్ని బుల్లెట్‌లను తన వద్ద పెట్టుకున్నా పోలీసు రికార్డుల్లో వాటిని ఎవరు గుర్తించలేదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ రికార్డుల పరిశీలనలో కూడా సంబంధిత అధికారలు నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుంది. పార్థసారథి దగ్గర ఇన్ని బుల్లెట్‌లు ఎలా జమ అయ్యాయని తేలాల్సి ఉంది. వీటన్నింటి లెక్కలను పార్థసారథి పని చేసిన చోట ఉండే బెల్ ఆఫ్ ఆర్మ్ రికార్డులలో నమోదు చేశాడా లేదా విషయాలను ఇప్పుడు హాయత్ నగర్ పోలీసులు తమ దర్యాప్తులో పరిశీలించే అవకాశం ఉంది. పార్థసారథిని ఏసీబీ అధికారులు లంచం డిమాండ్ చేసిన కేసులో అరెస్టు చేసి రిమాండ్ పంపిన తర్వాత హాయత్ నగర్ పోలీసులు పీటీ వారెంట్‌పై అతనిని కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని ఈ బుల్లెట్‌ల వ్యవహారంపై దర్యాప్తును చేయనున్నారు. బుల్లెట్‌ల వ్యవహారంపై హాయత్ నగర్ పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. మరో వైపు డీఎస్పీ పార్థసారథి లంచం డిమాండ్ కేసులో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులకు ఆయన ఇంట్లో భారీగా ల్యాండ్ డాక్యుమెంట్‌లు దొరికాయి. వీటి బహిరంగ మార్కెట్లో కోట్లాది రూపాయాలు విలువ చేస్తుందని సమాచారం.

## పాకిస్తాన్ హైకమిషన్ ఉద్యోగి రెహమాన్‌పై భారత్ వేటు



న్యూ ఢిల్లీ, మే 13 (తీన్మార్ న్యూస్): భారత్ - పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే చల్లబడి సాధారణ పరిస్థితులు వస్తోన్న వేళ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. పాకిస్తాన్ హైకమిషన్ ఉద్యోగి రెహమాన్‌పై భారత్ వేటు వేసింది. రాయబార కార్యాలయ ఉద్యోగి ముసుగులో రెహమాన్ అనే వ్యక్తి కొనసాగుతున్నాడు. డానిష్‌గా పేరు మార్చుకొని పనిచేస్తున్నాడు. గట్టుచప్పుడు కాకుండా భారత సైన్యానికి సంబంధించిన సమాచారం మొత్తం %×మా×%కి చేరవేస్తున్నాడని గుర్తించి వెంటనే అప్రత్తమైన కేంద్రం రెహమాన్‌పై వేటు వేసింది. రాయబార కార్యాలయంలో ఉండే అర్హతలేని వ్యక్తిగా అధికారిక ప్రకటన చేసింది. అంతేకాదు 24 గంటల్లో దేశం విడిచిపోవాలని భారత్ ఆదేశాలు జారీ చేసింది. లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని తీవ్ర హెచ్చరిక చేసింది. కాగా, కాసేపటి క్రితమే భారత విదేశాంగ శాఖ పాక్‌ను హెచ్చరించింది. మరోసారి తోక జాడిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. భారత్ ఆర్మీకి ఫుల్ పవర్స్ ఇచ్చామని పాకిస్తాన్ నుంచి ఎలాంటి దాడినైనా తిప్పికొట్టాలని ఆర్మీని ఆదేశించినట్లు తెలిపారు. పాక్ రెచ్చగొట్టే ప్రతీ చర్యకు ఊహించని విధంగా సమాధానం చెపుతామని అధికారులు ప్రకటించారు.

## ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియా నియమతులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానీయాకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. 1998 బ్యాచ్‌కు చెందిన సందీప్ కుమార్ సుల్తానియా బిహార్ రాష్ట్రానికి చెందిన వారు. చార్టర్డ్ అకౌంటెంట్‌గా అకౌంటెన్సీ విభాగంలో ఆయన గ్రాడ్యుయేట్. తొలుత ఆయన తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేశారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శిగా కూడా విధులు నిర్వర్తించారు. ఆర్థిక, రవాణా, సహకార సంస్థలు, పర్యాటక రంగాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. గ్రామీణాభివృద్ధి, భూ రెవెన్యూ నిర్వహణ, పట్టణాభివృద్ధిలో అపార అనుభవం ఆయన సొంతం. ప్రస్తుతం ప్రభుత్వ ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేస్తున్న ఆయన తాజాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమతులయ్యారు.

## లాడ్ బజార్‌లోని దుకాణాల్లో సుందరీమణుల షాపింగ్



మొదటి పేజీ తరువాయి

సుందరీమణులు చౌమొహల్లా ప్యాలెస్ అందాలను తిలకించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విందుకు సీఎం రేవంత్ రెడ్డి దంపతులతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు, సినీ తారలు హాజరయ్యారు. హీరో నాగార్జున తదితర సినీ సెలబ్రెటీలు ఈ విందులో సందడి చేశారు. ఈ విందుకు ముందు ప్రపంచ సుందరీమణులు చార్మినార్ దగ్గర సందడి చేశారు. 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్‌తో సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు భామలు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫొటో షూట్ నిర్వహించారు. అనంతరం లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపింగ్ చేశారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా సుందరీమణులు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్‌లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు పోలీసులు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదీనా, చార్మినార్, శాలిబండ, వొల్గా జంక్షన్, ఖిల్వత్ రోడ్లను పూర్తిగా క్లోజ్ చేశారు. మంగళవారం రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## వసతి గృహాల్లో మెరుగైన సేవలకు ప్రణాళికలు చేయాలి

మొదటి పేజీ తరువాయి

అధికారులను సీఎస్ కె.రామకృష్ణరావు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, చక్కటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సచివాలయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక, గిరిజన, మైనారిటీ వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా నాణ్యమైన సరుకులు, విద్యార్థుల టెక్స్ బుక్స్, నోట్ బుక్స్ యూనిఫామ్స్, బెడ్ షీట్లు కార్పెట్స్, స్కూల్ బ్యాగ్స్ తదితర సామగ్రి సమకూర్చుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సరుకుల క్వాలిటీ విషయంలో రాజీపడొద్దని సీఎం ఆదేశించాలని తదనుగుణంగా అధికారులు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

### నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకే:

విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లో జమ చేసేందుకు తగు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించడం వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థులు తమకు కావాల్సిన కాస్మెటిక్ వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ విక్రయకేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఎస్ సి డెవలప్ మెంట్ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కార్యదర్శి డా.ఎ వర్షిణి, సెర్ప్ సీఈవో దివ్య, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో భేటీ ఐన సమాచార కమిషనర్లు



హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం తాజాగా నలుగురు సమాచార ఆర్టీఐ కమిషనర్లను నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కుటుంబ సమేతంగా నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువలు కప్పి పుష్పగుచ్చం అందజేశారు. కాగా, గత కొన్నేళ్లుగా ఆర్టీఐ కమిషనర్ పదవులు ఖాళీగా ఉండటంతో, పౌరులకు సమయానికి సమాచారం లభించడంలో జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నూతనంగా నియామకాలు చేపట్టడం పౌర హక్కుల పరిరక్షణలో కీలక ముందడుగు పడింది. ప్రస్తుతం నియమితులైన కమిషనర్లు వేర్వేరు రంగాల్లో అనుభవం కలిగి ఉన్నవారు. వారి అనుభవం సమాచార హక్కు అమలులో నాణ్యతను మెరుగు పరచడానికి తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## టిబిని నిర్మూలనకు వ్యూహాలు అవసరమని ప్రధాని పిలుపు

మొదటి పేజీ తరువాయి

ప్రశంసిస్తూ, దేశవ్యాప్తంగా విజయవంతమైన వ్యూహాలను విస్తరించాలని పిలుపునిచ్చారు, భారతదేశం నుండి టిబిని నిర్మూలించడానికి భారతదేశం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఇటీవల ముగిసిన 100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రధానమంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో 12.97 కోట్ల మంది దుర్బల వ్యక్తులకు పరీక్షలు నిర్వహించారుబీ 7.19 లక్షల టీబీ కేసులు గుర్తించబడ్డాయి, వీటిలో 2.85 లక్షల లక్షణరహిత టీబీ కేసులు ఉన్నాయి. ఈ ప్రచారంలో లక్షకు పైగా కొత్త నిక్షయ్ మిత్రలు ఈ ప్రయత్నంలో చేరారు. ఇది దేశవ్యాప్తంగా ప్రభుత్వ మరియు సమాజ విధానాన్ని వేగవంతం చేసి, విస్తరించడానికి ఒక నమూనాగా నిలిచింది. ఈ సమావేశంలో ప్రధానమంత్రి, పట్టణ లేదా గ్రామీణ ప్రాంతాల ఆధారంగా మరియు వారి వృత్తుల ఆధారంగా టిబి రోగుల ధోరణులను విశ్లేషించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇది ముందస్తు పరీక్షలు మరియు చికిత్స అవసరమయ్యే సమూహాలను, ముఖ్యంగా నిర్మాణం, మైనింగ్, వస్త్ర మిల్లులు మరియు ఇలాంటి రంగాలలోని కార్మికులను గుర్తించడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. టిబి నిర్మూలనలో కీలకమైన చర్యగా జన్ భాగీదారీ ద్వారా పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను ప్రధానమంత్రి ప్రముఖంగా వివరించారు. ప్రతి రోగికి సరైన చికిత్స లభించేలా వ్యక్తిగతంగా వారిని సంప్రదించడానికి ప్రయత్నాలు జరగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో, ప్రధానమంత్రి డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ టిబి రిపోర్ట్ 2024 యొక్క ప్రోత్సాహకరమైన ఫలితాలను ప్రస్తావించారు, ఇది 2015 మరియు 2023 మధ్య లక్ష జనాభాకు 237 నుండి 195 కి తగ్గిన టిబి సంభవంలో 18 శాతం తగ్గింపును ధృవీకరించింది. టిబి మరణాలలో 21 శాతం తగ్గుదల మరియు 85 శాతం చికిత్స కవరేజ్ కనిపించిందని నివేదిక పేర్కొంది, ఇది కార్యక్రమం యొక్క పెరుగుతున్న పరిధి మరియు ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది.

8,540 నాట్ (న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్) ల్యాబ్‌లు మరియు 87 కల్చర్ మరియు డ్రగ్ ససెప్టబిలిటీ ల్యాబ్‌లకు టిబి డయాగ్నస్టిక్ నెట్‌వర్క్ విస్తరణతో సహా కీలకమైన మౌలిక సదుపాయాల మెరుగుదలలను ప్రధానమంత్రి సమీక్షించారు.

## రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఎంపికకు సిబిల్ స్కోర్..?

భద్రాద్రి కొతగూడెం, మే 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్‌కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికేందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం భద్రాద్రి కొతగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎక్కువ కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. 2023-24లో 7178 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈసారి 8245 కేంద్రాలు నెలకొల్పింది. ఈ ఏడాది యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. మొత్తం 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మొత్తం 70.13 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది.

## సైనిక్ స్కూల్స్‌లో లోకల్ కోటాపై స్పందించిన మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి

తెలిసిందే. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే వరకు ఏపీలో తెలంగాణ పిల్లలకు స్థానికత కల్పించాలని మంత్రి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ సర్కార్ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేలకు పైగా విద్యార్థులు అయోమయంలో ఉన్నట్లు పేర్కొన్నారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూల్స్ ఉన్నాయని, తెలంగాణలో కూడా తొందరగా సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని రిక్వెస్ట్ చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా, ఏపీలో గత పదేళ్లుగా 67 శాతం తెలంగాణ విద్యార్థులకు లోకల్ కోటాను ఇచ్చేది. అయితే ఈ ఏడాది ఏపీ సైనిక్ స్కూల్స్‌లో 67 శాతం లోకల్ కోటాలో తెలంగాణ విద్యార్థులను తొలగించినట్లు మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఉత్తర్వులు వచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు. ఈ విషయంపై ఇటీవల బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సైతం కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ను కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి మూడు సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ఏపీ సైనిక్ స్కూల్స్‌లో ఈ విద్యా సంవత్సరంలో తెలంగాణ విద్యార్థుల కోటాను కొనసాగించాలని విజ్ఞప్తి పత్రాన్ని అందించారు.

## వేసవి దృష్ట్యా వన్యప్రాణి సంరక్షణపై చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

అవుతున్నాయి. ముఖ్యంగా వేసవిలో అడవుల్లో వంట చేయడం, సిగరెట్, బీడీ, చుట్ట లాంటివి తాగి అక్కడ పడేయడంతో అటవీ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నట్లు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నివేదికలు చెబుతున్నాయి. మరోవైపు ఎండ వేడిమికి వన్య ప్రాణులు సైతం తీవ్రంగా అల్లాడిపోతాయి. ఈ నేపథ్యంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలు వాటి నివారణ, వన్యప్రాణి సంరక్షణపై తీసుకునే చర్యలపై సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్. సువర్ణ, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వర్చువల్ ద్వారా సమావేశంలో వివిధ జోన్ల సీసీఎఫ్‌లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలు పాల్గొన్నారు. కాగా, తెలంగాణలో గత కొంతకాలం కిందట అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో అటవీ ప్రమాదాలు జరిగాయని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నివేదికలు చెబుతున్నాయి.

## మే 15న ప్రారంభంకానున్న సరస్వతీ పుష్కరాలు

జయశంకర్ భూపాలపల్లి, మే 13 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్నాయి. రేపు ఉదయం 5.44 గంటలకు సరస్వతీ పుష్కరాలను శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఘనంగా ప్రారంభించనున్నారు. ఇక, అదే రోజు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకోనున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా పుష్కర స్నానాలు ఆచరించిన తర్వాత కాళేశ్వరాలయాన్ని దర్శించుకోనున్నారు. ఇక, సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరణ, గోదావరి హారతి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 790 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఈ పుష్కరాలను వెళ్లనున్నాయి. కాగా, పుష్కరాల కోసం పోలీసుల పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో సుమారు 3500 మంది పోలీసుల విధులు నిర్వహించనున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.



# ప్రజలందరి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



మహబూబాబాద్ జిల్లా, మే 13 (తీన్మార్ న్యూస్): ఈనెల 18న ఇందిరా గిరి జల సౌర వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు ప్రతి పథకం ప్రజల మంచి కోసం తీసుకొస్తున్న ప్రజా ప్రభుత్వం అని ప్రజలు గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని లక్ష్మీనరసింహాపురంలో 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన అనంతరం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. అటవీ హక్కుల చట్టం కింద ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేసుకునేందుకు వీలు కల్పించదని అన్నారు.గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ఈనెల 18న నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట లోని చెంచు కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించబోతున్నాం అని వివరించారు. ఈ పథకం కింద 12,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు గిరిజనులకు ఆదాయం వచ్చేలా ఉద్యానవన శాఖతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ పథకం కింద ప్రతి గిరిజన రైతుకు సోలార్ విద్యుత్ పంపుసెట్టు, స్ప్రింక్లర్లు, అవకాడో, పామ్ ఆయిల్ వంటి మొక్కలు ఉచితంగా అందజేస్తాం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే మన జీవితాలు మెరుగవుతాయి, దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతుందని పోరాటం చేశామని గుర్తు చేశారు. వనరులు, ఆర్థిక సంపద తెలంగాణ ప్రాంత ప్రజలు వాడుకుంటే వారికి మేలు జరుగుతుందని సోనియాగాంధీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రత్యేక రాష్ట్ర బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేసిందని అన్నారు. ఈ రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుంది అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశాం, 22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నాం, గిరిజన నియోజకవర్గాల్లో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ పథకం దేశ చరిత్రలోనే ఓ రికార్డు అన్నారు. ఇంటికో ఉద్యోగం అని 10 సంవత్సరాల కాలంలో ఒకసారి కూడా గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేకపోయారు కానీ మేం అధికారంలోకి రాగానే సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించాం, ఏడాదిన్నర కాలంలో 57, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు యువతను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం అనే స్వయం ఉపాధి పథకాన్ని తీసుకు వచ్చాం. 5 లక్షల మంది నిరుద్యోగులు వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్ల నిధులు ఖర్చు చేయనున్నాం. జూన్ 2న నిరుద్యోగ యువకులకు రాజీవ్ యువ వికాసం శాంక్షన్ లెటర్లు అందజేస్తాం అన్నారు. రైతు భరోసా పథకానికి మరో రెండు వేలు అదనంగా జోడించి అందజేస్తున్నాం అన్నారు. ప్రజా ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని మొదటి ఏడాదిలోనే చేసింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ కోసం 21,500 కోట్లు ఖర్చు చేసాం అన్నారు. 13వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రతినెల 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో సగభాగంగా ఉన్న మహిళలు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, గుడికి, లేదా పిల్లల బడికి వెళ్లేందుకు ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించింది, పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. 200 యూనిట్ల లోపు వాడుకునేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం అందుకు సంబంధించిన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లిస్తుందని ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో 80 నుంచి 90 శాతం మంది కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది అన్నారు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు అందిస్తూ వారి తరపున 12,500 కోట్ల రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుంది అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను మేము రాగానే ఆరు నెలల్లో పూర్తి అయ్యేవి, మూడు సంవత్సరాల్లో పూర్తి అయ్యేవి గుర్తించి నిధులు కేటాయించి వాటిని పూర్తి చేసే పనిలో పడ్డాం అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, వైరా శాసనసభ్యులు రామ్ దాస్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, విద్యుత్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి, సూపరిటెండెంట్ ఇంజనీర్ నరేష్, మూల మధుకర్ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థం అయ్యే ల భోధన ఉండాలి

### ఆధునిక పద్ధతులను పాటించాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, మే 13 (తీన్మార్ న్యూస్): రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచి గుణాత్మక విద్య అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈరోజు నుండి ఐదు రోజులపాటు స్థానిక క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి టీచర్స్ వృత్యంతర శిక్షణ (జిల్లా పరిషత్ ,మండల పరిషత్, ప్రభుత్వ, ఆదర్శ, తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ కొడకండ్ల, కేజీబీవీ పాఠశాలల టీచర్) ల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథి గా హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠ్యంశాల బోధనలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఈ శిక్షణ ఎంత గానో దోహద పడుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ తీసుకున్న శిక్షణ మెలుకువలను పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సిలబస్ పూర్తి చేయడమే కాదు. విద్యార్థులకు ఎంత మేరకు అర్థం అయ్యిందో కూడా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ప్రతి వృత్తిలో మెలకువలు సాధించడానికి తప్పనిసరి అని అలాంటి శిక్షణలు ఉపాధ్యాయులు సద్వినియోగ పరుచుకోని విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ ని అందించాలన్నారు. పుసక్త పరిజ్ఞానం తో పాటు అదునాతన టెక్నాలజీ కి తగ్గట్టు విద్యార్థుల మేధా శక్తిని పెంపొందించాలన్నారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, ఎస్ఏ. గణితం, ఎస్ఏ ఆంగ్లం ఎస్ఏ సాంఘిక శాస్త్రం విషయాల నుండి వి ఉపాధ్యాయులు ఈ శిక్షణ కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఏఎంవో బి శ్రీనివాస్ కోర్సు కోర్స్ ఇంచార్జ్ లు మల్లికార్జున్, యాదగిరి, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్లు పట్టివేత



ఆత్మకూర్ మే 13 తీన్మార్ న్యూస్: - వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామ శివారులో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఆత్మకూరు పట్టణంలో అక్రమంగా మొరం రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ తమ సిబ్బందితో నమ్మదగిన సమాచారం మేరకు మొరం ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్ల పై తగు చర్యలు తీసుకోవాల్సిన తాసిల్దార్ హ్యాండ్ ఓవర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను కానీ మరమును కానీ తరలించినట్లయితే వారిపై చట్టరీత్యా కట్టిన చర్యలు, తీసుకోబడతాయని హెచ్చరించారు.

## పోగొట్టుకున్నసెల్ఫోన్ బాధితునికి అందజేత

### సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా సెల్ఫోన్ రికవరీ




ఆత్మకూర్ మే 13 తీన్మార్ న్యూస్: - వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన చిన్నపాగ అశోక్ గత నెల 16వ తేదీన ఆరేపల్లి గ్రామం నుండి ఆత్మకూరుకి తన మోటార్ సైకిల్ పై వస్తుండగా మార్గమధ్యంలో తమ యొక్క మొబైల్ పోగొట్టుకోవడం జరిగింది వెంటనే ఆత్మకూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా మంగళవారం రోజు ఆత్మకూరు పోలీసులు సిఇఐఆర్ అప్లికేషన్ ద్వారా బాధ్యతని పోన్ని ట్రాక్ చేసి హైదరాబాదులో అతను ఫోన్ ట్రాకింగ్ చేయడం జరిగింది. మంగళవారం రోజు బాధితునికి ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ తమ ఫోను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్ ఫోను పోగొట్టుకున్న ఎడల లేదా దొంగలించిన వెంటనే సీఐఆర్ పోర్టల్ లో నమోదు చేయవలసిందిగా ఎస్సై నరేందర్ తెలిపారు.


## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్



ఆత్మకూరు మే 13 తీన్మార్ న్యూస్: - వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ఆత్మకూరు పట్టణ ప్రజలకు ఆత్మకూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు మరియు సైబర్ క్రైమ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. తమ ఫోన్లలో వాట్సాప్ లో అనవసరమైన లింకులను కానీ మెసేజ్లు కానీ ఓపెన్ చేయరాదని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి వివరాలు అడిగితే చెప్పవద్దని, మీ పేరుపై పార్సల్ వచ్చింది అని ఎవరైనా మిమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తే లేదా డబ్బులు పంపమని బెదిరించిన నమ్మవద్దని మీకు లెటర్ తగిలింది మీ అకౌంట్ కు సంబంధించిన వివరాలను తెలపండి అని అడిగితే అట్టి వివరాలను ఎవరికి తెలుపవద్దని సూచించారు. సైబర్ క్రైమ్స్ పై పాలు సూచనలను సలహాలను పట్టణ ప్రజలకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్సై రోశయ్య పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం



ఆత్మకూరు మే 13 తీన్మార్ న్యూస్: - వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏఐటియుసి సిఐటియు, టి యు సి ఐ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కేమోష హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు వ్యవసాయ కూలీలు రైతులు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని





ములుగు జిల్లా, మే 13 (తీన్మార్ న్యూస్): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నటువంటి ఐదు రోజుల వృత్యంతర శిక్షణ 13వ తేదీ రోజు ప్రారంభమైనట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని గారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రారంభ సమావేశంలో వారు మాట్లాడుతూ వృత్యంతర శిక్షణ అనేది ఉపాధ్యాయులు వారి యొక్క బోధన సామర్థ్యాన్ని, మెలకువలను మెరుగుపరచుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఉపాధ్యాయుడు బోధనలోని అంతరార్థాన్ని విద్యలోని ఆశించిన ఫలాల సాధనకు నిత్యం కృషి చేయాలని వారు అన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన జరగనుందని, ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల మరియు మోడల్ స్కూల్ లలో ఐ ఎఫ్ పి ప్యానెల్స్ ద్వారా డిజిటల్ బోధన జరుగుతున్నట్లు వారు తెలిపారు. మరియు అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుంది. కావున గ్రామస్తులకు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచుతూ 2025-26 విద్యా సంవత్సరం అత్యధికంగా విద్యార్థుల నమోదు జరిగేట్లుగా కృషి చేయాలని వారు అన్నారు. శిక్షణలో ఉపాధ్యాయులకు స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా టైం ఇన్ మరియు టైం అవుట్ నమోదు చేయవలసి ఉంటుంది కావున ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని అన్నారు. ఉపాధ్యాయులకు నిర్వహించే ఏ శిక్షణ కార్యక్రమాలైనా అంతిమ లక్ష్యం విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కావున శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయిలో శిక్షణ ఫలాలు విద్యార్థులకు అందేలా, ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం అయ్యేలా, బడిబాట కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, సెంటర్ ఇన్చార్జెస్ అప్పని జయదేవ్, అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య, గోవిందరావుపేట మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ కందాల రామయ్య, మోడల్ స్కూల్ చల్వాయి ప్రిన్సిపల్ కుమార్, ఇంగ్లీష్, గణితం, సోషల్, స్పెషల్ ఎడ్యుకేషన్, ఎస్ జి టి డిఆర్పీలు మరియు సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి




దేవరకద్ర ప్రతినిధి, మే13(తీన్మార్ న్యూస్) : పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఐసిడిఎస్ డైరెక్టర్ అధికారి స్వరూప కు విజ్ఞప్తి వనపర్తి జిల్లా కొత్తకోట ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టులోని అంగన్వాడి ఆయాలకు కు 10 నెలలు మరియు ఐదు నెలల పాటుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం నాడు హైదరాబాదులోని ఐసిడిఎస్ డైరెక్టర్ అధికారిని స్వరూపకు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ వినతి పత్రం అందజేశారు. 2021 సంవత్సరం ఆగస్టు నెల నుండి డిసెంబర్ వరకు ఆయాలకు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని ఆత్మకూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారులకు తెలియజేసినపట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఐసిడిఎస్ డైరెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో గాయత్రి,రాజేశ్వరి,శిరీష,అరుణ, మనిషా, రామేశ్వరి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



కాటారం, మే 13 (తీన్మార్ న్యూస్): మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున పెండింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు సీఎం రేవంత్ రెడ్డి సరస్వతీ పుష్కరాలకు వస్తారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పనులు పనులు స్పీడ్ గా జరుగుతున్నాయి. యూపీలో జరిగిన కుంభమేళా తరహాలో ఏర్పాట్లు అదిరిపోవాలి. యూపీలో జరిగే మహాకుంభమేళాకు రావాలని కొందరు సీఎం రేవంత్ రెడ్డిని కోరితే తెలంగాణలోనే అత్యంత వైభవంగా పుష్కరాలు జరుగుతాయని దానికి ప్రధానమంత్రికి ఆహ్వానం పంపుతామని తెలిపారని ఎంపీ వంశీ గుర్తుకు చేశారు. కుంభమేళా కంటే పది రేట్లు ఎక్కువగా సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తాం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా కు ఆహ్వానం అందిస్తాం. మోదీ వచ్చి తప్పకుండా కాళేశ్వరం వచ్చి సరస్వతి పుష్కరాల్లో త్రివేణి సంఘంలో పుణ్యస్నానాలు ఆచరించాలని కోరుతున్నాం.

## సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాలకు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 13 (తీన్మార్ న్యూస్): సరస్వతి పుష్కరాల నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయడంతోపాటు, అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టర్ స్వయంగా తాత్కాలిక బస్టాండ్, సరస్వతి విగ్రహం, విఐపి ఘాట్, భక్తులు పుష్కర స్నానాలు చేసే త్రివేణి సంగమ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగిలిన అన్ని పనులను బుధవారం వరకు పూర్తి స్థాయిలో ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులు సురక్షితంగా స్నానాలు చేయగలిగేలా ఘాట్ వద్ద విద్యుత్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. స్వచ్ఛ పుష్కరాలు కావాలని భక్తులు వినియోగించిన వ్యర్థాలను డస్ట్ ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. వివిధ పనులకు ఉపయోగించిన తదుపరి మిగిలిన పనికిరాని వస్తువులను గ్రామ పంచాయతీ నిర్దేశించిన ప్రాంతాల్లో వేసి పరిశుభ్రతకు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ వీరభద్రయ్య, భూపాలపల్లి ఆర్డీఓ రవి, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ విషయంలో విధానం యధాతథం

- కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అంగీకరించబోం
- పివోకెను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానం
- విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్



**న్యూఢిల్లీ, మే 13:** ఆపరేషన్ సింధూర్‌పై భారత విదేశాంగ శాఖ మంగళవారం కీలక ప్రకటన చేసింది. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్ విధానంలో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానమని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ కుండబద్దలు కొట్టారు. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అవసరం లేదని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక విధానంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తోందని రణ్‌ధీర్ జైస్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణపై డీజీఎంవోల సమావేశంలో చర్చించామని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. మే 10వ తేదీన పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పారు. ఆ క్రమంలో ఈ భేటీలో కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదత పాకిస్థాన్ నుంచే వచ్చిందన్నారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ జరుగుతోన్న సమయంలో భారత్, అమెరికా నాయకులు మాట్లాడారని గుర్తు చేశారు. అయితే ఇందులో వాణిజ్యపరమైన అంశాలపై చర్చ జరగలేదని చెప్పారు. ఇక సింధూ నది జలాల ఒప్పందంపై సస్పెన్షన్ కొనసాగుతుందన్నారు. కాశ్మీర్‌పై తమ విధానం మారలేదని తెలిపారు. కాశ్మీర్ అంశంపై ద్వైపాక్షింగా చర్చిస్తామని పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే చర్చలు ఉంటాయని ఆయన వివరించారు. టిఆర్ఎఫ్ లష్కరితోయోబా అనుబంధ సంస్థ అని తెలిపారు. దీనిపై అంతర్జాతీయంగా నిషేధం విధించేందుకు చర్యలు తీసుకుంటు–న్నామన్నారు. పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని వదిలివేయడం అనేది మిగిలి ఉన్న విషయమని రణధీర్ జైస్వాల్ తెలిపారు.




# నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను

## కేసీఆర్ ఆదేశాలు తప్పకుండా పాటిస్తా

## పార్టీ మారడం అన్న ప్రచారంలో నిజం లేదు: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్, మే 13:** భారాసలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ తర్వాత కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా. గతంలో కూడా ఈ అంశంపై చాలాసార్లు స్పష్టత ఇచ్చా. కార్యకర్తగా కేసీఆర్, పార్టీ ఆదేశాలను పూర్తిగా పాటిస్తా. కేసీఆర్ నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటానని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్యకర్తగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హరీష్ రావు మాట్లాడుతూ.. కెసిఆర్ మా అధ్యక్షుడు.. ఆయన చెప్పింది నేను తూ.చా. తప్పకుండా పాటిస్తానని అన్నారు. ఈ మాట తాను ఇప్పటికే చాలా సార్లు చెప్పానని.. ఎన్ని సార్లు అడిగిన ఇదే చెప్తానన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కెటిఆర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే.. తప్పకుండా స్వాగతిస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కెసిఆర్ నిర్ణయాన్ని ఎప్పుడు శిరసావహిస్తానని హరీష్ రావు క్లారిటీ– ఇచ్చారు.



# దేశంలో తుర్కియా వ్యతిరేక నినాదం

## ఆ దేశ యాపిల్ల అమ్మకాలపై నిషేధం


**పుణె, మే 13:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించడం పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోంది. దీంతో టర్కీ ఎర్దోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు. పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటున్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ టర్కీ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు– వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా దేశంలో నిరసనలు వస్తున్నాయి. తుర్కియా వస్తువును బహిష్కరించాలన్న పిలుపు ఊపందుకుంది.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

## ప్రయాణికులను దింపేసి తనిఖీలు

**కోల్‌కతా, మే 13 :** విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ రావడంతో కోల్‌కతాలోని నేతాజీ శుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైఅలర్ట్ ప్రకటించారు. ముంబైకి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేయడంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులను విమానం నుంచి దింపేసి తనిఖీలు నిర్వహించాయి. ప్రయాణికులంతా విమానంలో కూర్చున్న తరువాత ఈ కాల్ వచ్చిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటలకు విమానం టేకాఫ్ అవ్వాల్సి ఉందని వివరించారు. ఈలోపు బెదిరింపు కాల్ రావడంతో ఎమర్జెన్సీ ప్రొటోకాల్ ప్రకారం మొత్తం 195 మంది ప్రయాణికులను కిందకు దింపి విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్టు– వివరించారు. ఆపరేషన్ సిందూర్ తరువాత ఎయిర్–పోర్టులకు ఇలాంటి బెదిరింపు కాల్ రావడం ఇది రెండోసారి. అంతకుముసుపు మే 6న ముంబై ఎయిర్‌పోర్టుకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్ వచ్చింది. చండీగఢ్ నుంచి రానున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు– గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. ఆ తరువాత తనిఖీల సందర్భంగా అది నకిలీ కాల్ అని తేలింది.







# కుటుంబ సమేతంగా సీఎంను కలిసిన సమాచార కమిషనర్లు

**హైదరాబాద్, మే 13 :** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సమాచార కమిషనర్లుగా నియమితులైన నలుగురు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా కుటుంబ సమేతంగా కలిసి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ తమ కుటుంబాలతో సిఎంను కలవడం విశేషం. వారికి సిఎం అభినందనలు తెలిపారు.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు నష్టం




**ముంబయి, మే 13:** భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో సోమవారం దూసుకెళ్లిన భారత్ సూచీలు.. మంగళవారం భారీ నష్టాలు చవిచూశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు– క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ–స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీ–సీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో మ–ుగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది. సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీ–సీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ–షేర్లు మాత్రమే. రి–టైల్, హెచ్ఎన్ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కండి

## వరంగల్ నేతలకు కెటిఆర్ పిలుపు



**హైదరాబాద్, మే 13:** తెలంగాణ రాష్ట్రాన్ని పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ప్రజలకు వివరించండి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. వాగు దాటే దాక ఓడ మల్లన్న.. వాగు దాటినంక బోడి మల్లన్న అన్నట్టు– రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఉందన్నారు. వరంగల్ సభతో కాంగ్రెస్ అంతానికి ఆరంభం మొదలైంది.. కాంగ్రెస్ అరాచకాలను ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ఎదుదుర్కొం టుందని కేటీఆర్ తెలిపారు. అయితే, రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతంగా పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతుందని కేటీ–ఆర్ పేర్కొన్నారు. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలును ఎలా విస్మరించిందో ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో నెలకున్న సమస్యలను ప్రజలకు తెలిసేలా బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని కేటీఆర్ వెల్లడించారు.

# డీఎస్పీ ఇంట్లో వంద బుల్లెట్లు లభ్యం

**హైదరాబాద్, మే 13 :** ప్రజలకు అండగా ఉంటూ అక్రమాలను అరికట్టాల్సిన పోలీసు అధికారులే అవినీతికి పాల్పడుతున్నారు. లంచాలకు అలవాటు– పడి పేద ప్రజలను వేధిస్తున్నారు కొందరు పోలీసు అధికారులు. తాజాగా ఓ డీఎస్పీ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. సూర్యాపేట డిఎస్పి పార్థసారథి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. దీంతో హయత్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు– మరికొన్నిచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. డీఎస్పీ పార్థసారథి ఇంట్లో అక్రమంగా 100 బుల్లెట్లు– ఉన్నట్లు– గుర్తించారు. అంతేకాకుండా, ఆయన ఇంట్లో భారీగా ఆస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను కూడా గుర్తించారు. ఇల్లీగల్గా బుల్లెట్స్ ఉండడంతో ఏసీబీ అధికారులు హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉ–ూ పార్థసారథిపై హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కుడితిలో పడ్డ ఎలుకలా పాక్ పరిస్థితి

### సైన్యానికి, ఉగ్రవాదులకు తలొగ్గే దుస్థితి

### బలూచీ ఉద్యమం మరింత ఉధృతంతో భయం



**న్యూఢిల్లీ, మే 13:** పాక్ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. భారత్ ప్రతిదాడితో ఇక ముమ్ముందు సాహసం చేసే పరిస్థితి లేకుండా చేసుకుంది. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, ఉసిగొల్పడం ద్వారా భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకపోతే పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరని గతంలో అనేకమార్లు రుజువయ్యింది. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టారు. అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు. సైన్యాన్ని ఉగ్రవాదులు తమ అదుపులో పెట్టుకోగా, ప్రభుత్వాలను సైన్యం తన అదుపులో పెట్టుకుంటోంది. భారత్ ఉగ్రవాదులను మట్టుపెడితే వారికి పాక్ సైన్యం నివాళి అర్పించిందంటేనే ఎంతగా వారు దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఉగ్రవాదులను కట్టడి చేయాలనుకునే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా పాకిస్థాన్ అన్ని విధాలుగా నష్టపోతోంది. ఆ దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉంది. బయటి నుంచి ఆర్థిక సాయం అందని పక్షంలో పాక్ కుప్పకూలిపోతుంది. ఆర్థిక సంక్షోభం ఒకవైపు – అంతర్గత పోరు మరోవైపు ఆ దేశాన్ని కుంగదీస్తున్నప్పటికీ ఉగ్రవాదులు మతపరమైన ఉన్మాదంతో ఊగిపోతున్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం భూ భాగమైన బలూచిస్థాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడాలని కోరుకుంటోంది. ఇందుకోసం బలూచీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఈ తరుణంలో భారత్‌తో సయోధ్యకుమించిన మార్గం లేదు. అందుకే కాల్పుల విరమణకు పాక్ ముందుకు వచ్చింది. ఇందులో పాక్ రాయబేరమే ఎక్కువ. దానికి అంతర్జాతీయ మద్దతు కావాలి. రుణం కావాలి. అందుకే ట్రంప్ కాళ్లావేళ్లా పడి రుణం కోసం కాల్పుల విరమణకు సిద్ధపడింది. అయితే ఇది అక్కడి ఉగ్రవాదులకు, సైన్యానికి రుచించకున్నా తప్పని పరిస్థితి. మన దేశం 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మనకు 1947లో స్వాతంత్యం÷–ర వచ్చిన తర్వాత రెండుసార్లు పాకిస్థాన్‌తో, ఒకసారి చైనాతో యుద్ధం చేయాల్సి వచ్చింది. 1971 తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటం, స్వల్ప స్థాయిలో దాడులు చేసుకోవడం మినహా పూర్తి యుద్ధం జరగలేదు. 1971లో జరిగిన యుద్ధం గురించి ఇప్పుడు అరవై ఏళ్ల వయసు ఉన్న వారికి కూడా పూర్తిగా తెలియదు. అయితే ఆనాడు బంగ్లాను కోల్పోయిన పాక్ ఇప్ఉడు మొండగా ముందకు వెళితే బలూచీని కూడా కోల్పోవడం ఖాయం. అందుకే బలూచీని కాపాడుకునే క్రమంలో కాల్పులకు దూరంగా ఉండడానికి కూడా ఓ కారణంగా చూడాలి.

# ఎపి భవన్ బాలాజీ మందిరం సేఫ్

### కూల్చివేతను ఆపాలని సిఎం ఆదేశం




**న్యూఢిల్లీ, మే 13:** ఢిల్లీ ఏపీ భవన్‌లో బాలాజీ మందిరం కూల్చివేతను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అదికారులను ఆదేశించారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు, ప్రార్థనా మందిరం తొలగింపు ప్రతిపాదన అంశంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీ భవన్ స్థలాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పంచుకున్నాయి. ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలను ఏపీ యంత్రాంగం చేపట్టింది. ఏపీ భవన్ ప్రాంగణంలో 0.37 ఎకరాల్లో పలు ఆక్రమణలు ఉన్నట్లు– అధికారులు తేల్చారు. వాటి తొలగింపునకు సంప్రదింపుల ద్వారా, చట్టబద్ధంగా గత నెల నుంచి తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు– అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించే పక్రియ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రజల, మత సంస్థల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అక్కడ స్థానికులు ఏర్పాటు– చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులను సీఎం చంద్రబాబు వివరణ కోరారు. ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ముఖ్యమంత్రి సూచనలతో నిన్ననే నిర్మాణాల తొలగింపు పక్రియను నిలిపివేశామని అధికారులు చెప్పారు. ఆయా మతాలకు చెందిన వారి అభిప్రాయలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.



# తెలంగాణ రాష్ట్రంలో చురుకుగా ధాన్యం కొనుగోళ్లు

### ఇప్పటి వరకు 61.45 శాతం యాసంగి ధాన్యం సేకరణ

**హైదరాబాద్, మే 13 :** తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల పక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 61.45 శాతం యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తి అయినట్లు– పేర్కొనింది. మే 12వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది అన్నారు. ఇక, 2023– 24 సంవత్సరం ఇదే సమయానికి 29.88 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.. 2022–23లో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు– చెప్పుకొచ్చారు. అయితే, గత ఏడాదితో పోలిస్తే యాసంగి సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు– చేసిందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. 2023– 24లో 7,178 కేంద్రాలు ఏర్పాటు– చేయగా.. ఈసారి 8,245 కేంద్రాలు నెలకొల్పింది. ఈ ఏడాది యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.. మొత్తం 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది.



# మద్యం కేసులో మరో కీలక పరిణామం

### మైసూరులో బాలాజీ గోవిందప్ప అరెస్ట్

### విజయవాడకు తరలించిన సిట్ అధికారులు

**విజయవాడ, మే 13:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో మరొకరు అరెస్టు అయ్యారు. కీలక నిందితుడు బాలాజీ గోవిందప్పను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో మైసూరులో మంగళవారం ఉదయం గోవిందప్పను అరెస్ట్ చేసి.. విజయవాడకు తీసుకొస్తున్నారు. భారతీ సిమెంట్స్‌లో గోవిందప్ప డైరెక్టర్‌గా ఉన్నారు. లిక్కర్ స్కాం కేసులో అయన ఏ33గా ఉన్నారు. గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు డిస్మిస్ చేసింది. సుప్రీం కోర్టులో పిటిషన్ విచారణ దశలో ఉంది. ఏపీ లిక్కర్ స్కాం కేసులో విచారణకు హాజరుకావాలంటూ బాలాజీ గోవిందప్పతో పాటు– సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయ రెడ్డి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డికి 3 రోజుల క్రితం సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. విజయవాడ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయంలో గత ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని ముగ్గురిని ఆదేశించారు. అయితే వీరు ఆ నోటీసులను బేఖాతరు చేస్తూ.. విచారణకు డుమ్మా కొట్టారు. గోవిందప్ప మైసూరులో ఉన్నాడన్న పక్కా సమాచారంతో.. సిట్ అధికారులు అక్కడికి వెళ్లి ఈరోజు అరెస్ట్ చేశారు. గోవిందప్ప అరెస్టుతో లిక్కర్ కేసులో అరెస్టుల సంఖ్య ఐదుకి చేరింది. ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 గోవిందప్ప బాలాజీలను సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో నిందితులు పేర్కొన్నారు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వాళ్ల పేర్లు చేర్చినట్లు– మెమోలో సెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా వైఎస్ జగన్‌కు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితులు. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు– ధనుంజయరెడ్డి పాత్ర కీలకం. ముడుపులుగా ఎంత మెత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారని సిట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు.

# ఆనాడే పివోకెను ఎందుకు స్వాధీనం చేసుకోలే

### మీడయా సమావేశంలో కాంగ్రెస్‌కు అసోం సిఎం ప్రశ్న



**గువాహటి, మే 13:** 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించినా.. పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేను ఎందుకు స్వాధీన పర్చుకోలేఓ కాంగ్రెస్ చెప్పాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మఅన్నారు. పాక్‌తో కాల్పుల విరమణ అంశంపై ప్రధాని మోదీని ప్రశ్నించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని హిమంత బిశ్వ శర్మఅన్నారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించినా.. పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేను తిరిగి వశపరచుకునేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనకాడిందని ప్రశ్నించారు. 'చికెన్ నెక్ ఆఫ్ ఇండియా'గా పిలిచే సిలిగుడి కారిడార్‌ను కనీసం 100 మైళ్ల మేర అయినా ఎందుకు విస్తరించలేకపోయారని ప్రశ్నించారు. గువాహటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. ఒకవేళ ఇందిరాగాంధీ బతికి ఉంటే ఇవే ప్రశ్నలు ఆమెనే అడిగేవాడినని అన్నారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైన్యం అఖండ విజయం సాధించింది. పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి గానీ, ఈశాన్య రాష్ట్రాలను మిగతా భారతదేశానికి కలిపే 'చికెన్ నెక్'ను విస్తరించేందుకుగానీ, అదే సరైన సమయం. ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ అప్పట్లో ఆ పని ఎందుకు చేయలేదన్నారు. వివిధ దేశాల సరిహద్దులకు దగ్గరగా ఉండే ఈ వ్యూహాత్మక ప్రాంతాలను అప్పుడే భారత్ అధీనంలోకి తీసుకోవాల్సిందని బిశ్వశర్మ అన్నారు. తాజాగా పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పేందుకు, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా నాశనం చేసేందుకే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టినట్లు– చెప్పారు. ఆ లక్ష్యం పూర్తయిందని, అందుకే పాక్‌తో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించిందని తెలిపారు. ఉగ్రవాదులకు వత్తాసు పలికిన పాక్ సైన్యానికి కూడా భారత్ ఆర్మీ తగిన రీతిలో బదులిచ్చిందని పేర్కొన్నారు. భారత్ శక్తి ముందు నిలవలేమని భావించిన పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇవన్నీ కనిపిస్తున్నా..మోదీని విమర్శించడం తగదన్నారు. వాస్తవాలు గుర్తించి మాట్లాడితే మంచిదన్నారు.

# సెల్‌ఫోన్ మట్లాడుతూ పట్టాలు దాటే యత్నం

### రైలు ఢీకొనడంతో ఇద్దరు యువకుల దుర్మరణం

**చెన్నై, మే 13:** సెల్‌ఫోన్ ,ఏతిలో ఉంటే పరిసరాలను గమనించలేనంతగా మైమరిచిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా సెల్ ఫోన్.. ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఆ ఇద్దరూ రైలు ఢీకొని మృతి చెందారు. చెన్నైలోని స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లో ఈ ఘటన జరిగింది. పెరంబలూరుకు చెందిన మహమ్మద్ నఫూల్ (20), సబీర్ అహ్మద్ (20)లు థామస్ మౌంట్ సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. థామస్ మౌంట్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఇద్దరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటు–తున్నారు. అదే సమయంలో ఎగ్మూరు నుంచి తాంబరం వైపు వెళ్తున్న సబర్బన్ రైలు దూసుకొచ్చింది. రైలు డ్రైవర్ ఎన్నిసార్లు హారన్ మోగించినా.. స్దానికులు కేకలు వేస్తున్నా యువకులు పట్టించుకోలేదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలపైకి వచ్చేశారు. ఇద్దరినీ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. యువకుల మృతదేహాలను స్దానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహమ్మద్ నఫూల్, సబీర్ అహ్మద్ కలిసి ఆడంబాక్కంలోని ఒక హాస్టల్‌లో ఉన్నారు. ఇద్దరిలో ఒకరు కంప్యూటర్ సైన్స్. మరొకరు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం సాయంత్రం వారిద్దరూ సెయింట్ థామస్ మౌంట్ రైల్వే స్టేషన్ సమీపంలోని మైదానంలో క్రికెట్ ఆడటానికి వెళ్లారు. రాత్రి ఇద్దరు హాస్టల్‌కు తిరిగి రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా.. ఈ ఘటన జరిగింది.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిఎస్పీ

### సోదాలు చేయగా ఇంట్లో

### డీఎస్పీ ఇంట్లో వంద బుల్లెట్లు లభ్యం

**హైదరాబాద్, మే 13 :** ప్రజలకు అండగా ఉంటూ అక్రమాలను అరికట్టాల్సిన పోలీసు అధికారులే అవినీతికి పాల్పడుతున్నారు. లంచాలకు అలవాటు– పడి పేద ప్రజలను వేధిస్తున్నారు కొందరు పోలీసు అధికారులు. తాజాగా ఓ డీఎస్పీ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. సూర్యాపేట డిఎస్పి పార్థసారథి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. దీంతో హయత్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు– మరికొన్నిచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. డీఎస్పీ పార్థసారథి ఇంట్లో అక్రమంగా 100 బుల్లెట్లు– ఉన్నట్లు– గుర్తించారు. అంతేకాకుండా, ఆయన ఇంట్లో భారీగా ఆస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను కూడా గుర్తించారు. ఇల్లీగల్గా బుల్లెట్స్ ఉండడంతో ఏసీబీ అధికారులు హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉ÷ూ పార్థసారథిపై హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విరాట్‌కు దేశం ఘనంగా వీడ్కోలు పలుకుతోంది

**ఆటాడేవాళ్లుంటారు.. వేటాడేవాళ్లుంటారు. ఆటలో వేటాడే యోధులు అరుదుగా ఉంటారు. ఆటను ఆటాడుకున్న అలాంటి వాడొకడున్నాడు.. ఆ ఆట పేరు క్రికెట్ అయితే.. ఆ వేట పేరు విరాట్ కోహ్లీ.. ఇంత బిల్డప్ అవసరమా..? అతను ఆల్‌టైమ్ గ్రేటా అని అడిగేవాళ్లు చాలామంది ఉండొచ్చు. దానిపై చాలా చర్చ జరగొచ్చు. టెస్ట్ క్రికెట్‌కు విరాట్ కోహ్లీ గుడ్‌బై.. మోడ్రన్ టెస్ట్ క్రికెట్‌ను రీ డిఫైన్ చేసిన ప్లేయర్లలో ఒకడైన విరాట్ అలా సింపుల్‌గా సైలెంట్‌గా వెళ్లిపోతాడని ఏ క్రికెట్ అభిమాని కూడా ఊహించలేదు. అచ్చమైన ఆటకు అసలైన ప్లేయర్ వీడ్కోలు చెప్పడం ఎవరికి నచ్చుతుంది? ఓ ఆటగాడు వెళ్లిపోతే ఈ స్థాయిలో పొగడ్తలు అవసరమా.. క్రికెట్‌లో ఇంతకంటే వస్తాదుల్లేరా అని చాలామందికి కంప్లైంట్ ఉండొచ్చు.**




డాన్ బ్రాడ్‌మన్ కన్నా పెద్దోడా.. గ్యారీ సోబర్స్ కన్నా గొప్పోడా.. బ్రియాన్ లారా కన్నా బ్రిలియంటా.. లేక ప్రపంచ చరిత్రలోనే ఎవరికీ లేని రికార్డును సృష్టించిన క్రికెట్ దేవుడు.. సచిన్ కన్నా గొప్పోడా.. అనొచ్చు. వాళ్లందరితో పోలిక కాదు. ఆ మాటకొస్తే.. కేవలం టెస్ట్ క్రికెట్ మాత్రమే తీసుకుంటే అతనితో సమఉజ్జీలుగా నిలిచే స్మిత్, రూట్ వంటి వాళ్లు కూడా ఉన్నారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న క్రికెట్‌లో వేల మంది అంతర్జాతీయ క్రికెటర్లు వచ్చారు. అందులో గ్రేటెస్ట్‌లు చాలా మందున్నారు. మరెందుకు విరాట్ గురించి అంటే చెప్పుకోవడానికి చాలా ఉంది.ఇండియాలో క్రికెట్ అనేది ఎమోషన్.. కోట్లామందిని కలిపే భావోద్వేగం.. కోట్లమందికి ఆరాధ్యుడైన సచిన్‌లో అలాంటి ఎమోషన్ లేదు. ఇంకా చెప్పాలంటే.. నేటి ఆధునిక భారతీయ క్రికెట్‌కు అతను ముఖచిత్రం. 82 అంతర్జాతీయ సెంచరీలో%౫% 27 వేల పరుగులో.. కాదు విరాట్ అంటే! లేదా ఇప్పుడు టెస్టుల నుంచి రిటైరయ్యాడు కాబట్టి.. 30 సెంచరీలు.. 31 ఆఫ్ సెంటరీలు.. 9230 పరుగులు , ఇండియాలో టాప్ -4 టెస్ట్ టాపర్ ఇలాంటివి కూడా కాదు. విరాట్ అంటే అతని ఆటిట్యూడ్..! అడ్డకొట్టుడు.. దంచికొట్టుళ్లే రివాజైన పొట్టి క్రికెట్ జమానాలో అసలైన క్రికెట్ అంటే ఏంటో చూపించడం మామూలు విషయం కాదు కదా.. తన కళాత్మకమైన ఆటతో టెస్ట్ క్రికెట్‌కు కళ తెచ్చినవాడు. అందరికీ ఉన్నట్లే.. విరాట్‌కు క్రికెట్‌లో ఓ బలహీనత ఉంది. అది మినహా అతను పర్‌ఫెక్ట్ టెక్నిక్ ప్లేయర్. లెజెండరీ సునీల్ గవాస్కర్, సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్ లాంటి గొప్ప టెస్ట్ ప్లేయర్లతో సమానంగా ఈ నాటి క్రికెటర్లు రాణించాలంటే అది విరాట్ అయితేనే సాధ్యం. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ ది టైమ్ %+.ూ.ూ.౧% అంటాం. ముఖ్యంగా క్రీడల్లో ఉపయోగించే ఈ మాటను అత్యంత ప్రతిభ చూపిన వాళ్లకే ఉపయోగిస్తాం. ఒక ఆటగాడిగా అతనికున్న రికార్డులే అతనేంటో చెబుతాయి. వర్ధమాన క్రికెట్‌లో దాదాపు అసాధ్యం అనుకునే సచిన్ టెండూల్కర్ 100 సెంచరీల ఫీట్‌ను బ్రేక్ చేయగలిగినవాడు విరాట్ అని అంతా విశ్వసించారు. ఈవెన్ సచిన్ కూడా అది విరాట్ కు మాత్రమే సాధ్యం అని చెప్పాడు. ఏమైనా విరాట్ నిష్క్రమణతో ఆ రికార్డ్ పదిలంగా ఉండే అవకాశాలున్నాయి. తక్కువ టెస్టులు , వన్డేలు జరుగుతున్న తరుణంలో 82 సెంచరీలు చేయడం అన్నది సామాన్యమైన విషయం కాదు. ఒక్కో ఆటగాడికి ఒక్కో తరహా ఇమేజ్ ఉంటుంది. టెస్ట్, వన్డే ప్లేయర్లు అని... అయితే టెస్టు, వన్డే, టీ-20 , %IPL% ఇలా అన్నింటిలో అంతే ఇంపాక్ట్ ఇచ్చింది వన్ అండ్ ఓన్లీ కోహ్లీ. ఈ మూడు ఫార్మాట్లలో %×జజ చీశీ%.1 గా నిలిచింది %శీఅవ ఖఅఎ ూఅశ్రీఎ% కోహ్లీనే. ఆ తర్వాత ఈ ఫీట్ ఉంది.... మన బౌలర్ బుమ్రాకు.. !ఇండియన్ క్రికెట్ రూపరేఖలను మార్చిన కెప్టెన్‌గా సౌరభ్ గంగూలీని చెబుతారు. దానిని కొనసాగించనవాడు... ధోనీ... ఇక కోహ్లీ అయితే ఆట యాటిట్యూడ్‌నే మార్చేశాడు. అది అనేక సందర్భాల్లో కనిపించింది. అతని రికార్డుల్లో చూపిస్తోంది. 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ.. తాను ఆటగాడిగా ఓడిపోయింది.. 31టెస్టుల్లో మాత్రమే . ఇందులో మిగతా ఆటగాళ్ల పాత్ర ఉన్నా.. ప్రధాన ఆటగాడిగా కోహ్లీ ఎన్నో టెస్టులు గెలిపించాడు. ఇక కెప్టెన్‌గా 68 టెస్టులకు నాయకత్వం వహించిన విరాట్ ఓడిపోయింది 17 టెస్టులు మాత్రమే. ఇది మోస్ట్ సక్సెస్‌ఫుల్ రేట్. 2021 లో ఇంగ్లండ్‌లో అప్పటికే రెండు టెస్టులను కోల్పోయిన భారత్ తిరిగి పుంజుకుని సిరీస్‌ను కూడా కొట్టగలిగిందంటే.. అది కోహ్లీకున్న కసే. విరాట్ అప్పటి టీమ్‌ను ఎలా మోటివేట్ చేశాడో... స్టంప్ మైక్‌లో రికార్డ్ అయిందివిరాట్ అంటేనే ధైర్యం .. అందుకే తన మొదటి టెస్టులోనే అప్పటికే అత్యంత సీనియర్ , ధోనికి క్లోజ్ కూడా అయినటువంటి అశ్విన్‌ను కాదని కరణ్ శర్మను పిక్ చేశాడు. తనను పక్కన పెడుతున్నాడని గ్రహించి బీసీసీఐ ప్రెసిడెంట్‌గా ఉన్న గంగూలీతోనే గొడవకు దిగాడు. అంతెందుకు తనను వన్డే క్రికెట్ కెప్టెన్‌గా తప్పిస్తున్నారని ముందే తెలిసిపోయింది అతనికి.. కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో టెస్ట్ కెప్టెన్సీ కూడా నాకు అక్కర్లేదు పొమ్మన్నాడు. కొంత కాలం కెప్టెన్ గా చేసి ఉంటే.. ఇండియా తరపునే కాదు.. ప్రపంచంలోనే అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లు గెలిచిన కెప్టెన్ అయ్యుండే వాడు. 10వేల క్లబ్ అన్నది ఏ ఆటగాడికైనా ఓ డ్రీమ్. దానికి దగ్గరలో ఉండి కూడా టెస్ట్ క్రికెట్‌ను వదిలేశాడు. అంతెందుకు ఇప్పుడు విరాట్ రిటైర్మెంట్‌ను బీసీసీఐ ఒప్పుకోకపోయినా.. అతను మాట వినలేదు. విరాట్ కోరుకుంటే.. టెస్ట్ క్రికెట్‌కు తాను ఇచ్చిన దానికి బీసీసీఐ ఓ ఘనమైన వీడ్కోలు ఇచ్చేది. కానీ తాను మాత్రం సైలంట్‌గా సైడైపోయాడు..ఏ ఆటగాడిపైనా ఫాల్ అన్నది తప్పదు. విరాట్ దానికి అతీతుడు కాదు.. అన్నీ గొప్పలేనా.. తప్పులు లేవా అంటే ఉన్నాయి. ఇంతటి గ్రేట్ బ్యాట్స్‌మన్ అయినా అవుట్ సైడ్ ఆఫ్ వెళ్లే బాల్‌ను కెలికి అవుటవ్వడం విరాట్ బలహీనత. ఎక్కువ సార్లు కాట్ బిహైండ్, ఫస్ట్ స్లిప్‌లోనే దొరికిపోతాడు. ఆ బలహీనతతో ఓ ఆస్ట్రేలియా సిరిస్, ఇంగ్లండ్ సిరిస్ లో సరిగ్గా ఆడలేకపోయాడు. ఆ బలహీనత నుంచి పట్టుదలతో బయటపడి.. ఆస్ట్రేలియాలోనే సెంచరీలు కొట్టాడు. అయితే 2022 లో కెప్టెన్సీ వదిలేసినప్పటి నుంచి విరాట్ డౌన్ ఫాల్ మొదలైంది. 2014-18 లో కెరీర్ పీక్స్ లో దాదాపు 70 పరుగుల యావరేజ్ ఉన్న అతను లాస్ట్ 3 ఏళ్లలో ముప్పైల్లోకి వచ్చేశాడు. ఇక వదిలేయాలిసిన తరుణం వచ్చిందని అతనికి తెలుసు. వైట్ ఇండియన్ జెర్సీలో... పలుచని దేహంతో బౌండరీలైన్ దాటుతూ లోపలకు వచ్చే ఆ చిరుతను మళ్లీ మనం అలా గ్రౌండ్‌లో చూడలేకపోవచ్చు. అద్భుతమైన విరాట్ ఇన్నింగ్స్‌లు చూసిన అడిలెడ్, ఆంటిగ్వా, నాటింగ్ హామ్, పెర్త్, జోహెన్సస్‌బర్గ్ లు ఇక ఆ ఆటను ఆస్వాదించలేకపోవచ్చు. ధనాధన్ బ్యాటింగ్‌ల కాలంలో ఐదురోజుల క్రికెట్ ను ఇండియాలో ఆకర్షణీయంగా మార్చేసిన వాడు .. టెస్ట్ మ్యూచ్‌లకు కూడా స్టేడియంకు జనాలను ఫుల్ చేసిన వాడు.. అతను. అందుకే గ్రేటర్, గ్రెటెస్ట్‌లు ఎంత మంది ఉన్నా.. విరాట్ విరాటే. ఆట.. మాట.. ఒకే రీతిలో సాగిన వాడు.. అంతటి ప్రైడ్‌కు చాలా మంది ఆటగాళ్లు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు.



# క్రికెట్ ఫ్యాన్స్‌కు బీసీసీఐ గుడ్‌న్యూస్

## మే 17న ఐపీఎల్ తిరిగి ప్రారంభం

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ క్రికెట్ ప్రేమికులకు శుభవార్త చెప్పింది. ఐపీఎల్ 2025 పునఃప్రారంభ తేదీని ప్రకటించింది. ఐపీఎల్ 2025 మే 17న తిరిగి ప్రారంభమవుతుంది. ఇటీవల భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా బీసీసీఐ ఈ లీగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేయడం తెలిసిందే. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటన అనంతరం ఉద్రిక్తతలు తగ్గడంతో లీగ్ కంటిన్యూ చేయాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. "భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఐపీఎల్ మ్యాచ్‌ల పునఃప్రారంభాన్ని ప్రకటిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, భద్రతా సంస్థలతో సంప్రదింపుల తరువాత సీజన్ మిగిలిన మ్యాచ్‌లు కొనసాగించాలని నిర్ణయించింది. మే 17వ తేదీన రీస్టార్ట్ కానుండగా, జూన్ 3, 2025 న జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియనుంది.కేవలం 6 వేదికలలో మొత్తం 17 మ్యాచ్‌లు జరుగుతాయి. బీసీసీఐ సవరించిన ఐపీఎల్ షెడ్యూల్‌లో రెండు డబుల్ హెడర్లు ఉన్నాయి, అవి రెండు ఆదివారాల్లో జరుగుతాయి. ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించిన వేదిక వివరాలను తరువాత ప్రకటిస్తాం" అని అధికారిక ప్రకటనలో పేర్కొంది. భారతదేశ సాయుధ దళాల ధైర్యసాహసాలకు బీసీసీఐ మరోసారి సెల్యూట్ చేసింది. దేశం కోసం వారు చేసే పోరాటం ప్రజలను ప్రశాంతంగా ఉంచుతుంది. దేశంలో అంతా సజావుగా ఉండటానికి వారి కృషి కారణం. భారత బలగాల చర్యలతోనే బీసీసీఐ మిగిలిన ఐపీఎల్ లీగ్ పూర్తి చేయనుంది. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బోర్డు నడుచుకుంటుందని మరోసారి బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటివరకు 2025లో, 3 జట్లు ప్లేఆఫ్ పోటీ రేసు నుంచి నిష్క్రమించాయి. 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ నుంచి తప్పుకున్న మొదటి జట్టుగా మారింది, మాజీ ఛాంపియన్స్ రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు కూడా ప్లే ఆఫ్ రేసు నుంచి తప్పుకున్నాయి. ప్రస్తుత ఛాంపియన్లు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ చివరి మ్యాచ్‌లో చెన్నైచేతిలో ఓటమిని చవిచూశారు. దాంతో వారి ప్లే ఆఫ్ అవకాశాలు మరింత క్లిష్టతరం అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్ 3 స్థానాల్లో ఉన్నాయి. వరుస విజయాలు సాధిస్తున్న ముంబై కూడా ప్లే ఆఫ్ రేసులో బెర్త్ కోసం చూస్తోంది.

# రెండు స్టేడియాలకు ఉగ్రవాదుల బెదిరింపులు!



భారత క్రికెట్ ప్రస్తుతం ఒక ఆందోళనకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. దేశంలోని వివిధ క్రికెట్ స్టేడియాలకు వం-ుసగా వస్తున్న బాంబు బెదిరింపులు, అభిమానుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. మే 12న రాజస్థాన్‌లోని జైపూర్ సవాయి మాన్సింగ్ స్టేడియానికి వచ్చిన బాంబు బెదిరింపు వార్త కలకలం రేపింది. ఈ బెదిరింపు స్పోర్ట్స్ కౌన్సిల్ అధికారిక ఇమెయిల్‌కు పంపబడినట్టు అదనపు ఎస్పీ లలిత్ శర్మ వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే అధికారులు అప్రమత్తమై స్టేడియాన్ని ఖాళీ చేయించి, బాంబు డిఫ్యూజర్ దళాన్ని, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. ఈ మేరకు ప్రాథమిక తనిఖీలు జరిగాయి. ఇదే రోజు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ హెూల్కర్ స్టేడియానికి కూడా బాంబు బెదిరింపు వచ్చింది. ఇది కేవలం మూడు రోజుల్లో ఆ స్టేడియానికి వచ్చిన రెండవ బెదిరింపుగా నమోదైంది. తుకోగంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ జితేంద్ర సింగ్ యాదవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. అయితే, ఇక్కడ కూడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఇప్పటికే మే 9న %వీూజూ% కు ఇలాంటి నకిలీ బెదిరింపు ఇమెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.ఇలాంటి సంఘటనలు క్రికెట్ స్టేడియాలే కాకుండా, దేశ భద్రతపై కూడా ప్రశ్నలు పెడుతున్నాయి. గత వారం కూడా జైపూర్ స్టేడియానికి ఇమెయిల్ ద్వారానే బాంబు బెదిరింపు వచ్చినప్పుడు, అధికారులు వెంటనే స్పందించి స్టేడియాన్ని ఖాళీ చేయించారు. ఈ విషయాన్ని రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు నీరజ్, మెంబర్ పవన్ ధృవీకరించారు. ఈ బెదిరింపు అధికారిక స్పోర్ట్స్ కౌన్సిల్ మెయిల్ ఐడీకి పంపబడినదని వారు వెల్లడించారు. ఇంతలో, బాంబు డిఫ్యూజర్ బృందాలు, పరిశీలన దళాలు సుదీర్ఘంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి.ఇది కేవలం రెండు స్టేడియాలకే పరిమితమైలేదు. గత నెలలో ఏప్రిల్ ప్రారంభంలో కోల్‌కతాలోని ప్రసిద్ధ ఈడెన్ గార్డెన్స్ స్టేడియంకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. అప్పట్లో ఐపీఎల్ 2025 లో %ఖఖ=ఐం జూఖ% మధ్య మ్యాచ్ జరుగుతున్న సందర్భంలో బెంగాల్ క్రికెట్ అసోసియేషన్‌కు తెలియని వ్యక్తి ఒకరు ఈ బెదిరింపు ఇమెయిల్ పంపారు. అయితే ఆ సమయంలో కూడా ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు లభించలేదు.ఈ బెదిరింపుల వెనక కారణాలను విశ్లేషించితే, ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తరువాత భారత్ %-% పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరం కావడం ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దేశ భద్రతా సంస్థలు, పోలీసులు దీనిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ, వరుసగా స్టేడియాలను లక్ష్యంగా చేసుకుంటూ వస్తున్న ఈ బెదిరింపులు క్రీడాభిమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

# భయంతో వణికిపోయాం..

## స్టార్క్ సతీమణి అలీస్సా హీలీ

భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ధర్మశాల వేదికగా జరగాల్సిన పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ రద్దయిన విషయం తెలిసిందే. భారత సరిహద్దు నగరాలపై పాకిస్థాన్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో మైదానంలో ఫ్లడ్ లైట్స్ ఆపేసి మ్యాచ్‌ను నిలిపేసారు. ఆటగాళ్లను అక్కడి నుంచి హుటాహుటిన తరలించారు. ధర్మశాల ఎయిర్‌పోర్ట్ మూసి వేయడంతో ప్రత్యేకమైన వందేభారత్ ట్రైన్‌లో ఢిల్లీకి తరలించారు.అయితే ఆ సమయంలో తీవ్ర భయాందోళనకు గురయ్యామని ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్, మిచెల్ స్టార్క్ సతీమణి అలీస్సా హీలీ తెలిపింది. ఆ రోజు తమకు ఎదురైన అనుభవాలను ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పంచుకుంది. ఆ దేవుడి దయ వల్ల అందరం క్షేమంగా బయటపడ్డాం అని చెప్పుకొచ్చాడు.




# డబ్ల్యూటీసీ ఫైనల్‌కు కంగారుల తుది టీమ్




ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షి తో పాటూ, వెస్టిండీస్ పర్యటన కోసం 16 మంది సభ్యులతో కూడిన బలమైన, అనుభవం కలిగిన జట్టును ప్రకటించింది. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఈ జట్టులో అనేక ప్రధాన ఆటగాళ్లతో పాటు కొత్త అవకాశాలు అందుకున్న ఆటగాళ్లకు కూడా చోటు కల్పించారు. ముఖ్యంగా, వెన్ను శస్త్రచికిత్స అనంతరం తిరిగి వచ్చిన ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ పునరాగమనం ఆస్ట్రేలియా జట్టుకు బలాన్ని చేకూర్చింది. అతని తిరిగివచ్చే అంశం టెస్ట్ క్రికెట్లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే, దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనలతో ఆకట్టుకున్న బ్యూ వెబ్‌స్టర్‌కు ఎంపిక జరగడం గమనార్హం.బ్యాటింగ్ విభాగంలో, టాప్ ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్, మార్నస్ లాబుస్చాగ్నే, ఉస్మాన్ ఖవాజా లాంటి అనుభవజ్ఞులు ఉన్నారు. వికెట్ కీపర్లుగా అలెక్స్ కారీ, జోష్ ఇంగ్లిస్ లు ఎంపికయ్యారు. స్పిన్ విభాగంలో నాథన్ లియాన్, మాథ్యూ కుహ్నెమాన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఇక ఫాస్ట్ బౌలింగ్ విభాగాన్ని పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్కాట్ బోలాండ్‌ల బృందం నాయకత్వం వహించనుంది. ఇది ప్రత్యర్థి జట్లకు గట్టి పోటీని అందించే బౌలింగ్ దళంగా మారుతుంది.ఒక ఆశ్చర్యకరమైన ఎంపికగా సామ్ కాన్స్టాస్‌ను ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా జట్టులో చేర్చారు. భారత్‌తో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అతను చూపించిన ప్రతిభ జట్టు సెలెక్షన్‌లో కీలకంగా మారింది. మరోవైపు, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 48 మ్యాచ్‌ల్లో 177 వికెట్లు తీసిన బ్రెండన్ డాగెట్ ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు. అతనికి ఇది అంతర్జాతీయ స్థాయిలో మరో అవకాశంగా మారవచ్చు.ఈ జట్టు లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగనున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తుదికి, ఆ తర్వాతి వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌కు మార్పులు లేకుండానే ఎంపిక చేయబడింది. ఈ నిర్ణయం జట్టులో స్థిరత్వాన్ని కల్పించే ప్రయత్నంగా భావించవచ్చు. ఆసక్తికరంగా, జట్టులో అనుభవం, యువ శక్తికి సమతుల్యత ఉండేలా సెలెక్షన్ జరగడం, ఆస్ట్రేలియా క్రికెట్ దృష్టిని భవిష్యత్తుపై సారించడం స్పష్టమవుతోంది. %ఔజ% ఫైనల్‌లో ఈ జట్టు ఎలా రాణిస్తుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**ఆస్ట్రేలియా జట్టు :** పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, కామెరాన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టాస్, మాట్ కుహ్నెమాన్, మార్నస్ లాబుస్చాగ్నే, నాథన్ లియాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్

## నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కూలీ




రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగ రాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణా నంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ క్రమంలో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. రజనీకాంత్‌కు తొలుత వేరే కథ చెప్పానని, అది ఆయనకు నచ్చినా అనుకోని కారణాలతో ఈ కథను పక్కన పెట్టినట్లు తెలిపారు.రజనీకాంత్ సర్‌తో సినిమా చేయాలనుకున్నప్పుడు ఆయన్ను కలిసి ఒక కథ చెప్పాను. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు నెలలకు పైగా ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ఆ కథ, దాని నేపథ్యం రజనీ సర్‌కు బాగా నచ్చాయి. రెండు నెలల తర్వాత మళ్లీ ఆయన్ను కలిసినప్పుడు 'ఈ కథ వద్దు. మరొక స్టోరీ చేద్దాం' అని అన్నాను. అదే 'కూలీ'. రజనీ సర్‌కు ఆ స్టోరీ నచ్చినా నేను చేయకపోవడానికి ఒక కారణం ఉంది. నేను అనుకున్న పాయింట్ ఒక చోట పూర్తిగా డౌన్ అయిపోయినట్లు అనిపించింది. దీంతో ఆ ప్రాజెక్ట్‌పై ఆసక్తి సన్నగిల్లిపోయింది. భవిష్యత్‌లో ఎప్పుడైనా కొత్త ఆలోచన వస్తే, ఆ కథను అందుకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తా. అంతేకానీ, అదే కథను పట్టుకుని రజనీ సర్ విలువైన సమయాన్ని వృథా చేయటం నాకు ఇష్టం లేదని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' విషయానికొస్తే భారీ బడ్జెట్, భారీ తారాగణంతో లోకేశ్ దీన్ని తీర్చిదిద్దారు. ఐటమ్ సాంగ్‌లో పూజా హెగ్డే ఆడి పాడింది. ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారు. ఆగస్టు 14న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'కూలీ'ని విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ మూవీ తీసుకొస్తున్నారు. రజనీకాంత్ ఇందులో కూలీ నెంబర్ 1421గా దేవా పాత్రలో సందడి చేయనున్నారు.

## అమెజాన్ ప్రైమ్‌లోనూ యాడ్స్




ప్రముఖ ఓటిటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు షాక్ ఇవ్వబోతోంది. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇ-మెయిల్స్ పంపిస్తోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమితి సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్-ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది.

## జయం రవి,కెనిషాల మధ్య పెరిగిన బంధం

### భార్య ఆర్తి కామెంట్స్‌కు కెనీషా ఘాటు జవాబు



హీరో జయం రవి ఇంటి గురించి రోజుకో వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ముందు నుంచి సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ కి జయం రవి కి మధ్య రిలేషన్ ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. రీసెంట్‌గా ఓ పెళ్లికి వీరిద్దరు జంటగా హాజరవడంతో మరోసారి కోలీవుడ్ లో పుకార్లు మరింత పుంజుకున్నాయి. ఈ ఫోటో క్షణాల్లోనే సోషల్ మీడియా మొత్తం వైరల్ అవ్వడంతో ఇది చూసిన జయం రవి భార్య ఆర్తి సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసింది. 'మాకు చట్టరిత్య ఇంకా విడాకులు అవ్వలేదు, విడాకులు వచ్చేవరకు నేను ఆర్తి రవినే,18 సంవత్సరాలు నాతో కలిసి ఉన్న వ్యక్తి నన్ను ఇంట్లో నుండి గెంటేసి, పిల్లలను కూడా పట్టించుకోకుండా, వారి అవసరాలకు కావలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు' అంటూ షాకింగ్ పోస్ట్ చేసింది. అయితే ఈ మాటలపై తాజాగా సింగర్ కెనీషా రివర్స్ పంచ్ ఇచ్చింది.. ఎవరికీ లొంగని ఒక మగాడు.. ఏ మహిళతో అయితే ఆనందం ఉంటుందో ఆ మహిళ దగ్గరే ఉంటాడు. ఆ మహిళకే మనసు ఇస్తాడు. మౌనంగా ఉంటున్నాను కదా అని నన్ను లైట్ తీసుకోకు.. నా మౌనమే నా బలం' అంటూ ఆర్తికి పరోక్షంగా కొటేషన్‌తో కౌంటర్ ఇచ్చింది. దీంతో సింగర్ కెనీషా పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అంటే దీని అర్థం ఆర్తి దగ్గర ప్రశాంతత లేకపోవడం వల్లే కెనిషాకి జయం రవి దగ్గరై ఆమెకు మనసిచ్చాడని పూర్తిగా అర్థమవుతుంది అంటూ నెటిజన్ల కామెంట్లు పెడుతున్నారు.



## కాలేజీ డేస్‌లోనే మహేశ్ బాబు తెలుసు

కాలేజ్ డేస్ నుండే మహేష్ బాబుతో త్రిష పరిచయయముందంట. సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రిష జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జోడికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉం టుంది. వీరిద్దరు అతడు సినిమాలో నటించగా, అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికి కూడా ఈ సినిమా టీవీలో వేస్తే చాలు ఎంతోమంది చూస్తూ ఉంటారు. ఒక రకంగా టీవీలో బ్లాక్ బస్టర్ సినిమా ఏది అంటే అతడు అనే అంటారు అందరూ. మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన ఈ సినిమా థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన బుల్లి తెరపై మాత్రం మంచి విజయం సాధించింది. ముఖ్యంగా ఈ చిత్రంలో త్రిష, మహేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బావ ప్రేమకోసం ఎదురుచూసే పల్లెటూరి అమ్మాయిగా త్రిష పాత్రలో ఒదిగిపోయింది. ఇక మహేష్ బాబు కూడా కాస్త యాటిట్యూడ్ ప్రదర్శిస్తూ సీరియస్‌గా చాలా అద్భుతంగా నటించారు. వారిద్దరి పాత్రలకి ప్రేక్షకులు ఇట్టే కనెక్ట్ అయ్యారు. అతడు తర్వాత త్రిష మహేష్ బాబు కలిసి సైనికుడు సినిమా చేశారు. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ తర్వాత త్రిష, మహేష్ బాబు కలిసి నటించలేదు. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి త్రిష ఆసక్తికర కామెంట్స్ చేసింది. మహేష్ బాబు తన ఫేవరెట్ హీరోల్లో ఒకరు అని చెప్పిన ఈ ముద్దుగుమ్మ .. మహేష్ బాబు సెట్ లో చాలా సరదాగా ఉంటాడని, చాలా హార్డ్ వర్క్ చేస్తాడు అని పేర్కొంది.. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కూడా అందరిని చాలా గౌరవిస్తాడు. అసలు కారవాన్ లోకి కూడా వెళ్లడు. తన షూటింగ్ అయిపోయినా కూడా .. మానిటర్ దగ్గర కూర్చొని ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉంటారు.. చాలా మందికి తెలి యని విషయం ఏంటంటే మహేష్ బాబు నాకు చాలా కాలం నుంచి తెలుసు. మేము ఇద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాము. మా ఇద్దరికి మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండేవారు. వారి వల్ల మహేష్ తో పరిచయం ఏర్పడింది. ఆ టైం లో మేము యాక్టర్స్ అవుతామని ఊహించలేదు. అప్పుడు హాయ్, బాయ్ ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేది అని త్రిష పేర్కొంది. ఇక ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తెలుగులో చిరంజీవితో విశ్వంభర చేస్తుంది.



## చీరకట్టులో కేరళ కుట్టి.. మాళవిక.. కెవ్వు కేక..

సోషల్ మీడియాలో మాళవిక పెట్టిన ఫోటోలకు ప్రస్తుతం కుర్రకారు గుండె వేగంగా కొట్టుకుంటోంది. చీరకట్టులో సింపుల్‌గా కేరళ అందాలతో పాటుగా తన అందాల్ని ప్రదర్శించింది మాళవిక. ప్రస్తుతం ఈమె ఫోటోలు నెట్టింట్లో ట్రెండ్ అవుతున్నాయి. కేరళ కుట్టి మాళవిక మోహనన్ కోలీవుడ్‌లో మంచి సినిమాలు చేస్తూ క్రేజ్ దక్కించుకుంటోంది. డబ్బింగ్ చిత్రాలతోనే మాళవిక తెలుగు ఆడియెన్స్‌ను మెప్పించింది. ఇక త్వరలోనే మాళవిక రాజా సాబ్ చిత్రంతో తెలుగు వారిని నేరుగా పలకరించనుంది. ఈ మూవీ కోసం మాళవిక బాగానే ఎదురుచూస్తోంది. ఇక నెట్టింట్లో ఈ భామ పెట్టే పోజులు, వదిలే ఫోటోలకు కుర్రకారు మతి పోతుంటుంది. తాజాగా చీరకట్టుతో కేరళలో ఇలా చక్కర్లు కొట్టింది



## స్టార్ హీరోయిన్ సినిమాలకు బ్రేక్..!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియరా అద్వాని బిఫోర్ మ్యారేజ్ వరకు సూపర్ ఫాం లో ఉంది. 2023 ఫిబ్రవరిలో సిద్ధార్థ్ తో పెళ్లి తర్వాత కెరీర్ లో దూకుడు తగ్గించింది కియరా. పెళ్లైతే అవకాశాలు తగ్గుతాయి అన్నది ఇదివరకు మాట ఇప్పుడు పెళ్లైనా పిల్లలు ఉన్నా సరే టాలెంట్ కి ఏది అడ్డు రావట్లేదు. ఇప్పటికే బాలీవుడ్ లో చాలామంది హీరోయిన్స్ పెళ్లై పిల్లలు ఉన్నా కూడా సినిమాల్లో రాణిస్తున్నారు. అలియా భట్, దీపిక దీనికి ప్రధాన ఉదాహరణగా చెప్పొచ్చు. ఐతే కియరా జస్ట్ పెళ్లి మాత్రమే చేసుకుంది ఇంకా పిల్లల విషయంలో నిర్ణయాలు తీసుకోలేదని అనుకున్నారు. కానీ ఇప్పుడు అది కూడా అయ్యింది. ప్రస్తుతం కియరా ప్రెగ్నన్సీ గా ఉంది. సో ఈ టైం లో సినిమాలు చేయడం కష్టం. ప్రస్తుతం ఆమె ఎన్ టీ ఆర్, హృతిక్ రోషన్ చేస్తున్న వార్ 2 లో నటిస్తుంది. ఆ సినిమా ఆగష్టు 14న రిలీజ్ అనుకున్నారు. మరి అనుకున్న టైం కు రిలీజ్ అవుతుందా అన్నది చెప్పడం కష్టం. కియరా పోర్షన్ పూర్తై ఉంటే రిలీజ్ చేసే ఛాన్స్ ఉంది కానీ కియరా కి సంబంధించిన సీన్స్ పెండింగ్ ఉంటే మాత్రం సినిమా ఆ టైం కి పూర్తి చేయడం కష్టం. ఈమధ్యనే కియరా ఒక ఈవెంట్ కి బేబీ బంప్ తో వచ్చింది. సో కియరా డెలివరీ అయ్యాక ఎలా లేదన్నా ఒక ఆరు నెలలు రెస్ట్ తీసుకునే ఛాన్స్ ఉంటుంది. ఇంకా టైం కావాలంటే ఒక ఏడాది టైం తీసుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. కియరా ఈ ఏడాది పాటు సినిమాలు చేసే ఛాన్స్ లేదు. వార్ 2 తో పాటు అమ్మడు కె.జి.ఎఫ్ టాక్సిక్ లో కూడా నటిస్తుంది. సో కియరా బ్రేక్ తీసుకుంటే కచ్చితంగా ఆ సినిమా మీద ఎఫెక్ట్ పడుతుంది. టాక్సిక్ సినిమాను 2026 సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేశారు. మరి కియరా ఈలోగా ఆ షూటింగ్ కి సహకరిస్తుందా లేదా అన్నది చూడాలి. బాలీవుడ్ లో కూడా వార్ 2 తప్ప కియరా వేరే ప్రాజెక్ట్ కి సైన్ చేయలేదు. ఐతే అసలే అవకాశాలు లేని ఈ టైం లో కియరా ఈ బ్రేక్ తీసుకోవడం తప్పనిసరి అయినా ఆమె కెరీర్ మీద కచ్చితంగా ఇంపాక్ట్ పడేలా చేస్తుందని అనిపిస్తుంది. మరి కియరా మళ్లీ బ్రేక్ తర్వాత కంబ్యాక్ ఇస్తుందా లేదా అన్నది చూడాలి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463